కె.వి.నరేందర్

# ఎబిసిడి



**కృష్ణమూర్తి కందుకూరి...**

**ఇరవై మూడేళ్ళకిందే అమెరికాలో స్థిరపడ్డ ప్రవాసాంధ్రుడు. కోటి డాలర్లు సంపాదించినా ఇంట్లో తెలుగు సంస్కృతినీ, సాంప్రదాయాల్ని తప్పకుండా పాటించే వ్యక్తి... ఆయనకు తగ్గ భార్య సునంద!!**

హూస్టన్ సిటీలోని వాళ్ళింట్లో... ఆరోజు... భార్యభర్తలిద్దరు అసహనంగా వున్నారు...

అమెరికాలో స్థిరపడ్డందుకు... అనూహ్యంగా తలెత్తిన సమస్య.

గారాల కూతురు... రోష్ని.

రోష్నికి పదిహేడేళ్ళు నిండాయి. ఇంజనీరింగ్‌లో జాయినయింది. అమెరికాలోని విచ్చలవిడి స్వేచ్ఛ ఎక్కడికి దారి తీస్తుందోనని, పన్నెండో ఏటనించే రోష్నిని కంటికి రెప్పలా కనిపెడుతున్నారు. ఎందుకంటే అమెరికా అమ్మాయిలు పదమూడేళ్లకే 'డేటింగ్' పేరుతో అబ్బాయిల వెంట తిరుగుతారు. చాలామంది అమెరికన్ తల్లులు తమ కూతుళ్ళకి ఎక్కడ గర్భం వస్తుందోనని ఆ వయసునించే రోజూ పొద్దున్నే పాలల్లో అబార్షన్ పౌడర్ కలిపిస్తారు.

అలాంటి పద్ధతులు నచ్చని సునంద రోష్నికి ఇండియన్ కల్చర్ గురించీ, తెలుగుదనం గురించి పాఠాలు నూరిపోస్తుంది. ఇంట్లో వ్రతాలు చేస్తూ వాటి విలువలు తెలియజెప్తుంది. కృష్ణమూర్తి కూడా తీరిక దొరికినప్పుడల్లా సాంప్రదాయాల గురించి చెప్పేవాడు.

ఇంత చేసినా రోష్నికోసం ఆరోజు... ఒక అమెరికన్ యువకుడి ఫోన్ కాలొచ్చింది. ఫోన్ రికార్డర్‌లో ఆ మాటలు విన్న కృష్ణమూర్తి వాళ్ళ సంభాషణ పూర్తిగా ప్రేమలో మునిగిపోయిందని తెల్సి సునందపై మండిపడ్డాడు.

చివరికి రోష్నినే అడిగారు.

కుండబద్దలుకొట్టినట్టు చెప్పింది... 'నేను హెన్రిక్‌ని లవ్ చేస్తున్నానని'

పిడుగుపడ్డట్టు చలించిపోయారు కృష్ణమూర్తి సునందలు.

అప్పుడే హెన్రిక్ నించి ఫోనొచ్చింది. కృష్ణమూర్తి ఫోన్‌లోనే నిలదీస్తే... ధైర్యంగా, తేలిగ్గా చెప్పాడు. 'రోష్నిని పెళ్ళిచేసుకుంటాను'అని.

దాంతో మరీ ఉగ్రుడైపోయాడు కృష్ణమూర్తి.

ఫోన్ పెట్టేసి ''ఎంత ధైర్యంగా చెప్తున్నాడే, వాడు అమెరికావాడు కాబట్టి వాళ్ళకు ఈరోజు ప్రేమ...రేపు పెళ్లి... ఎల్లుండి విడాకులు... కాని నువ్వు ఇండియన్ గాళ్‌వని మర్చిపోయావా...'' అన్నాడు సీరియస్‌గా.

రోష్ని కోపంతో చివ్వున లేచింది.

''ఇండియా... ఇండియా... ఇండియా... ఆ ఇండియా ఎలా వుంటుందో కూడా నాకు తెలియదు.

నన్ను మీరు కన్నది అమెరికాలో... నేను పెరుగుతున్నది అమెరికాలో, నేను చదువుతున్నది అమెరికాలో... నా ఫ్రెండ్సంతా అమెరికన్లే... నాకు అమెరికన్ ప్రపంచం తప్ప ఏమీ తెలీదు. ఏనాడూ చూడని ఇండియా నాకు నా దేశం ఎలా అవుతుంది? ఇంట్లో ఇండియా వాతావరణం సృష్టించుకొని... మీలో జీర్ణించుకుపోయిన ఇండియా సంస్కృతిని, సంప్రదాయాల్ని నూరిపోసినా... బయటికి అడుగుపెడితే మాత్రం నాకు కన్పించేదంతా అమెరికన్ కల్చరే... అలాంటప్పుడు మాకు అమెరికన్ కల్చర్ అలవాటు పడితే తప్పువమాదికాదు. అమెరికా వచ్చిన మీది...'' అంది.

ఆ మాటకి నిర్ఘాంతపోయారు సునంద, కృష్ణమూర్తి.

కోపం పట్టలేని కృష్ణమూర్తి కూతుర్ని ఈడ్చి చెంపదెబ్బ కొట్టాడు.

''నీకు గారాబం ఎక్కువై ఇలా తయారయ్యావే... ఈ క్షణంనించే నువ్వు కాలు బయటపెడితే చంపేస్తాను...''అని హెచ్చరించి సీరియస్‌గా బయటికెళ్లిపోయాడు.

సునంద రోష్నిని దగ్గర తీసుకుంది.

కన్నీళ్లు తుడుస్తూ లాలనగా చెప్పింది.

''నువ్వు చేసింది తప్పు రోష్ని. అమెరికన్‌ని పెళ్ళిచేసుకుంటే ఎలాంటి ఇబ్బందులొస్తాయో ఏనాడైనా ఆలోచించావా? వాడు ఈ ఇంట్లో అల్లుడిగా తిరిగినా వాడి రూపం, వేషం, భాష అన్నీ మాకు పరాయిగానే వుంటాయి. ఇండియానించి మీ నానమ్మో, తాతయ్యో వస్తే వాళ్ళతో ఎలా కల్సిపోగలడు? మన చుట్టాల్లో మనల్ని ఎంతమంది గౌరవిస్తారు? రేపు నీకు పిల్లలు పుడితే చర్చికి పోతారా? గుడికి పోతారా? ఒక్క ఆచారాలే కాదు... మాట్లాడే భాషలో, చివరికి తినే తిండిలో కూడా వాడికీ మనకి పొంతన వుండదు. మనం రోజూ అన్నం, పప్పుచారు, పెరుగు తింటాం. కాని వాడు మెకరో, గ్రిల్డ్ చీజ్, శాండ్‌విచ్, నాచుస్, స్పెగటీ, ఎంచిలాడాస్, బర్రీటోస్ లాంటి నాన్‌వెజ్‌లన్నీ తింటాడు. అలాంటి వాడిని పెళ్ళిచేస్కోవడం బుద్ధితక్కువ'' అంది.

రోష్ని మనసులో జరుగుతున్న సంఘర్షణ తన్నుకొచ్చింది. ''నా బాధని మీరెలా అర్థం చేసుకుంటారు మమ్మీ... ఏనాడూ చూడని ఇండియాని ప్రేమించమంటారు. ఏనాడూ ఎరుగని సంస్కృతిని ఫాలో కమ్మంటారు. కులాలు, గోత్రాలు లేని ఎవరి జీవిత భాగస్వామిని వారు ఎన్నుకునే అమెరికన్ సమాజంలో కని, పెంచి, పెద్దచేసి... పెళ్లిచేసుకొని చచ్చేంతవరకూ సంసారం చేయమనే ఇండియా కల్చర్‌ని, బలవంతంగా ఇండియన్‌లా ఫీల్ కమ్మని ఆజ్ఞాపిస్తే... హెచ్చరిస్తే... చివరికి కొట్టి చెప్పినా... నేను ఇండియన్‌ని ఎలా కాగలను... నువ్వే చెప్పు మమ్మీ...''అంది ఏడుస్తూ...

సునంద అయోమయంలో పడింది.

రోష్నిలో ఇంత బలమైన వాదన గూడుకట్టుకుందని... అది ఇలా బద్ధలవుతుందని వూహించక ఆలోచనలో పడిపోయింది.

''మమ్మీ... ప్లీజ్ లీవ్ మీ ఎలోన్''అని తన గదిలోకెళ్లి తలుపేసుకొని పడుకుంది రోష్ని.

సునందకు ఏం చేయాలో అర్థంకాలేదు.

రోష్ని మాటలు వింతగా, విచిత్రంగా తోస్తున్నాయి. తన ఫ్రెండ్స్ విజయలక్ష్మికి ఫోన్ చేసి చెప్పింది.

'రోష్ని ప్రవర్తన ఇలా మారిందే... అమెరికన్‌ని అంటోంది. నాకు ఏడుపొస్తుంది అని!

ఫోన్‌లో విజయలక్ష్మి కూడా ఆందోళనగా అడిగింది.

''మీ ఇంట్లో కూడా ఈ సమస్య మొదలైందా? లలిత రాగోని వాళ్లింట్లో కూడా వాళ్ళబ్బాయి ఓ బ్లాక్ (నీగ్రో)ని ప్రేమించి ఇలాగే అంటున్నాడట. చాలా సంవత్సరాల కింద అమెరికాలో స్థిరపడ్డ కుటుంబాలు 'సెకెండ్ జనరేషన్'తో ఈ సమస్యతోనే కుంగిపోతున్నాయి. ఈ సెకెండ్ జనరేషన్‌కి ఎ బి సి డి అని పేరు పెట్టారు. అంటే... అమెరికన్ బోర్న్ కన్ఫ్యూజ్డ్ దేశీ. ఇక్కడే పుట్టిపెరిగిన మన పిల్లలు అటు ఇండియా సాంప్రదాయాలకీ, ఇటు అమెరికా సంస్కృతికి మధ్య నలిగిపోయి నేను ఇండియన్‌నా? అమెరికన్ నా? అనే కన్ఫ్యూజ్‌లో పడిపోయే స్ట్రగుల్ అయ్యే తరమన్నమాట.''

''కాని... రోష్ని ఇలా చేస్తుందని వూహించలేదు''అంది సునంద గొంతు పూడుకుపోతుంటే.

''అది రోష్ని తప్పుకాదు సునందా... ఇండియన్ గాళ్‌లా బుద్ధిగా కూచున్నా... ఏ ఒక్క బోయ్‌ఫ్రెండ్ లేకపోయినా ఇక్కడ అవహేళనగా చూస్తారు. దాంతో మన పిల్లలు ఫీలై ఎవరో ఒకరికి దగ్గర కావాలనుకుంటారు''అంది విజయలక్ష్మి.

''అది కాదు విజయ... నేను చీరె కట్టుకోవడాన్ని, బొట్టు పెట్టుకోవడాన్ని అది జోక్‌గా ఎగతాళి చేస్తే ఏమో అనుకున్నాను గాని అదింత రెబిలియన్ మెంటాలిటీగా మారుతుందని అనుకోలేదు''అంది కన్నీళ్లు తుడుచుకుంటూ...

''తరాల మధ్య పెరుగుతున్న అంతరం ఇది... మీ వారేమంటున్నారు?'' అనడిగింది విజయలక్ష్మి.

''వాడిని చేసుకుంటే దీని చంపేసేలా వున్నారు. ఆయన ఉగ్రరూపం చూస్తే మాకు భయమేస్తోంది. దీని ఏడ్పు చూస్తేనేమో గుండెలు కరిగిపోతున్నాయి. అమెరికాలో మా పరువేమవుతుందోనని భయంగా వుందే...''అని ఫోన్‌లోనే భోరున ఏడ్చేసింది సునంద.

''ఈ సమస్యనుండి బయటపడటం కూడా అంత తేలిక గాదు సునందా... రోష్నికి బాగా చెప్పి చూడండి. అంతకు మించి ఏంచేయలేం...'' ఫోన్‌లోనే పెదవి విరిచి పెట్టేసింది విజయలక్ష్మి.

తర్వాత... ఒకరిద్దరికి... కృష్ణమూర్తి కూతురు అమెరికన్‌ని లవ్ చేసి... పెళ్లి కూడా చేసుకోబోతుందట. కృష్ణమూర్తి, సునంద బాగా ఏడుస్తున్నారు''అని ఫోన్‌లో ఆత్రుతగా చెప్పింది విజయలక్ష్మి.

అరగంట దాకా... చాలామంది ప్రవాసాంధ్రుల ఇళ్ళల్లోని ఫోన్‌లన్నీ గుసగుసల్తో బిజీగా మారాయి.

★ ★ ★

రెండు గంటల తర్వాత ఇల్లుచేరిన కృష్ణమూర్తికి ఫోన్‌ల మీద ఫోన్‌లొచ్చాయి. అందరి పలకరింపుల్లోనూ ఒక జాలి... ఒక అయ్యో పాపం... ఒక ఎగతాళి... పిల్లల్ని ఎలా పెంచాలో నీతి సూక్తుల్ని వెల్లువలా వచ్చాయి.

కృష్ణమూర్తి గుండె బరువుగా మారింది.

పరువుపోతున్నందుకు కన్నీళ్లు ఉబికివచ్చాయి.

దుఃఖాన్ని, కోపాన్ని గొంతులోనే ఆపుకొని కూతురి గదిలోకొచ్చాడు. అప్పటిదాకా ఎంతో చెప్పి చూస్తున్న సునంద భర్త గదిలోకి రాగానే ఓ మూల నిల్చుంది.

''నీకు పాస్‌పోర్ట్, వీసాలు రెడీ చేసాను. తాతయ్య దగ్గరికి ఇండియా వెళ్ళు'' అన్నాడు కోపంగా కృష్ణమూర్తి.

''నేను వెళ్లను'' కటువుగా చెప్పింది రోష్ని.

''ఎందుకెళ్ళవే... ఇండియానే మన దేశం...''అన్నాడు తన్నుకొస్తున్న ఆగ్రహాన్ని అణిచిపెట్టుకుంటూ.

''ఇండియా నా దేశమైతే నన్ను చిన్నప్పుడే పంపించి వుండాల్సింది. లేదంటే అమెరికాలో నన్నెందుకు కన్నారు? కన్నా... ఇక్కడే ఎందుకు పెంచారు? మీ నోటి వెంట వినటం తప్ప ఏనాడు చూడని ఇండియాని పదేపదే



''నో డాడ్... ఎప్పుడైతే ఇరవై మూడేళ్ళ కింద నించే నువ్వు అమెరికాలో స్థిరపడ్డావో... నీ కూతురు కూడా అమెరికన్‌లా ప్రవర్తిస్తే నువ్వు ఒప్పుకోవాలి. ఒప్పుకొని తీరాలి. తప్పదు.''

గుర్తుచేసి... నువ్వు ఇండియన్‌వి... నువ్వు తెలుగమ్మాయివి అని బలవంతంగా చెప్పినంత మాత్రాన నేను ఇండియన్‌ని ఎలా కాగలను? పదిహేడేళ్లుగా నేను చూస్తున్నదంతా అమెరికా ప్రపంచం. పుట్టిపెరిగింది ఇక్కడే. అయినప్పుడు నేను ఖచ్చితంగా అమెరికన్‌నే...''అంది కోపంతో మొహం ఎర్రబారుతుంటే.

''అంటే నువ్వు మా కూతురివి కాదా? నేను, మీ మమ్మీ ఇండియన్స్‌మి అయినప్పుడు మా కడుపులో పుట్టిన నువ్వు అమెరికన్‌వెలా అవుతావే?'' అన్నాడు.

''డాడీ... నేనున్న సమాజమే.. నేను పుట్టిన పెరిగిన సమాజమే నాకు ముఖ్యం... కొన్ని లక్షల మైళ్ళ దూరంలో వున్న దేశం గురించి నాకు చెప్పకండి. మీరు అమెరికా వచ్చింది సంపాదనక్కావచ్చు... ఇరవై మూడేళ్ళుగా కోట్ల డాలర్లు సంపాదించారు. అయినా మీరింకా అమెరికానే ఎందుకు పట్టుకు వేలాడుతున్నారు? ఇండియా... ఇండియా అని నిద్రలో కూడా పలవరించే వాళ్ళు ఇప్పటికైనా ఇండియా వెళ్ళిపోవచ్చు కదా...''అంది సూటిగా చూస్తూ.

ఆ మాటకి కృష్ణమూర్తి షాక్ తిన్నట్టు...అలాగే బిత్తరపోయి నిల్చున్నాడు.

''మీరెళ్లరు డాడీ... అమెరికా విడిచిపెట్టి మీరు వెళ్లరు. జననీ జన్మభూమిశ్చ, స్వర్గాదపీ గరీయసి అంటూ శ్లోకాలు వల్లించినంత మాత్రాన ఇండియా పట్ల ప్రేమున్నట్లు కాదు డాడీ... అమెరికా తిండి తింటూ... అమెరికా గాలి పీలుస్తూ... ఏ దేశమేగినా ఎందుకాలిడినా పొగడరా నీ తల్లి భూమి భారతిని అంటూ పాటలు పాడుతారు. కాని అమెరికా విడిచిపెట్టడం మాత్రం మీకు నామోషి. మీకు అమెరికా కావాలి... అమెరికాలో దొరికే డాలర్లు కావాలి. ఇక్కడి గొప్ప జీవితం కావాలి. కాని ఇండియా పేరుని మాత్రం కొంగ జపంలా జపించాలి. మీరు ఇండియా అప్పుడప్పుడు వెళ్ళేది పది శాతం మమకారం మీదయితే తొంభై శాతం మీ వాళ్ళందరి దగ్గర డబ్బు దర్పాలు ప్రదర్శించుకోవడానికే...''

రోష్ని మాటలు పూర్తికాకముందే కృష్ణమూర్తి అరిచాడు.

''యూ స్టుపిడ్... నీవన్నీ పిచ్చి ఆలోచనలు''

రోష్నికూడా అదే స్థాయిలో చెప్పింది.

''నో డాడ్... ఎప్పుడైతే ఇరవై మూడేళ్ళ కింద నించే నువ్వు అమెరికాలో స్థిరపడ్డావో... నీ కూతురు కూడా అమెరికన్‌లా ప్రవర్తిస్తే నువ్వు ఒప్పుకోవాలి. ఒప్పుకొని తీరాలి. తప్పదు.''

''రోష్ని... నీ మాటలు మితిమీరుతున్నాయి...''

''ఆత్మవంచన చేసుకొని బతకడం నావల్లకాదు డాడీ... అందుకే నేను ఇండియన్‌ని అని రెక్కలు కట్టుకొని ఇండియాకి ఎగిరి వెళ్ళలేను. ఈ పాస్‌పోర్ట్‌లు, వీసాలు మానసికంగా మాత్రం నన్ను ఇండియన్‌గా మార్చలేవు. నేను హెన్రిక్‌తో వెళ్ళిపోవడానికే సిద్ధపడ్డాను.'' అని గదిలో సిద్ధంగా వుంచుకున్న బ్రీఫ్‌కేస్‌ని తీస్కొంది.

అప్పటివరకు ఏడుస్తూ చూస్తున్న తల్లి ''పిచ్చి ముండా...ఏంటే నువ్వు చేస్తున్న పని...''అంటూ రోష్నిని బెడ్‌పైకి తోసేసి బ్రీఫ్‌కేస్ తీసుకొని ఓ మూలకి విసిరేసింది.

కృష్ణమూర్తి శిలాప్రతిమలా నిల్చుండిపోయాడు.

బెడ్ మీద పడ్డ రోష్ని అంతే కోపంగా చివ్వున లేచింది.

''మమ్మీ... నన్ను ఆపొద్దు... నేను హెన్రిక్‌నే పెళ్ళి చేస్కుంటాను...'' అని వెళ్ళిపోతూ... వెనక్కి తిరిగి ''డాడ్... కాశ్మీర్ తీవ్రవాదుల గొడవల్ని టీవీలో చూపించినప్పుడు పాకిస్తాన్ ఎన్ని కపట బోధనలు చేసినా ఇండియాలో పుట్టిపెరిగిన ముస్లింలు ఇండియన్సే అవుతారు అని చెప్పేవాడివి. కానీ... నీ కూతురి వరకొచ్చేసరికి... ఎంత స్వార్థం... అయినా సరే... నే వెళ్లిపోతున్నాను...అయాం ఏన్ అమెరికన్... రేపే సెయింట్ లూయిస్ చర్చిలో మా పెళ్లి...''అంటూ వెళ్లిపోయింది.

సునంద బావురుమంది.

కృష్ణమూర్తికి దుఃఖం రాలేదు... మనసు బండబారిపోతుంటే కన్నీళ్లు గడ్డకట్టుకుపోయాయి.

''ఏమండీ... మన బిడ్డ వెళ్ళిపోతుందండీ...'' సునంద ఏడ్పు గుండెని పెకిలిస్తున్నా... కృష్ణమూర్తి అలాగే నిల్చుండిపోయాడు. ఇంట్లోంచి ఓ శవం తరలిపోయినంత దుఃఖం...

ఓదార్చడానికి ఎవరూ లేని ఒంటరితనం... కృష్ణమూర్తి సునందని దగ్గర తీసుకొని హత్తుకున్నాడు. ఆమె కన్నీళ్లతో అతడి షర్టు తడిసిపోయింది.

రెండున్నర గంటల తర్వాత...

ఇంట్లో లాంగ్ రింగ్ మోగింది. కృష్ణమూర్తి ఫోనెత్తాడు. హలో అని కూడా అనలేనంతగా గొంతు నరాలు మొద్దుబారిపోయాయి.

''కృష్ణమూర్తి... నేనురా... ఇండియానించి మీ నాన్నని...'' అన్న పిలుపు.

''నా... న్నా...''

''అవున్రా... నీ బిడ్డని పుట్టినప్పట్నించీ చూల్లేదు. వచ్చే సంవత్సరం దాని పెళ్లి తిరుపతిలో చేస్తాను నాన్నా అని నువ్వంటే... పద్దెనిమిదేళ్ళకైనా మనవరాల్ని చూడబోతున్నానని క్షణాలు లెక్కబెట్టుకుంటూ కూచున్నాన్రా...కానీ అదో అమెరికా వాడితో వెళ్ళిపోయిందని ఇప్పుడే తెల్సి...తట్టుకోలేక ఫోన్ చేస్తున్నాను...'' అన్నాడు.

''నీకెలా తెల్సింది నాన్నా...''అనడానిక్కూడా నోరు రాలేదు.

''నా... న్నా...'' అని గుండెలు పగిలిపోయేలా ఫోన్ క్రెడిల్ పట్టుకొని ఏడ్చాడు కృష్ణమూర్తి.

(మిగతా 12వ పేజీలో)


# జెన్ జగత్

-- సౌభాగ్య --

## అమాయకుడు

యమ మొటు యసువొ ప్రాచీన జపాన్ సాహిత్యంలో పండితుడు. దేశీయ కవిత్వంలోనూ నిష్ణాతుడు. రాచరిక పూజావిధానంలోని క్షీణతకు దుఃఖపడి 'దేవుళ్ళ యదార్థం'అన్న గ్రంథం రాసి నిష్కర్షగా తన అభిప్రాయాల్ని వ్యక్తపరచి ఆత్మహత్య చేసుకున్నాడు.

సామాజికంగా అతను సంపన్నుడు. అతను మరణించే నాటికి అతనికి నలుగురు కొడుకులు, ఒక కూతురు వున్నారు. అతని పెద్దకొడుకు స్వేచ్ఛాచింతన గలవాడు. కుటుంబ వారసత్వాన్ని తీసుకోవడానికి వైముఖ్యం ప్రదర్శించి, అన్నీ వదులుకొని, ఇల్లు వదిలి జెన్ అభ్యసించడానికి వెళ్ళిపోయాడు. తన పేరును 'గొప్ప బుద్ధిహీనుడు'గా మార్చుకున్నాడు. ఇరవైరెండు సంవత్సరాల వయసులో తగిన గురువును అన్వేషిస్తూ సాగిపోయాడు. ఒక గురువును సంపాదించిన జెన్ బౌద్ధంలో పరిపూర్ణ జ్ఞానం పొందాడు. కొన్ని సంవత్సరాలు శ్రమించాడు.



తిరిగి అక్కడనుండి బయల్దేరి ఎన్నో ప్రాంతాలు పర్యటించాడు. ఎందరో జెన్ గురువుల్ని దర్శించాడు తన జ్ఞానాన్ని విస్తృతపరచుకున్నాడు. అట్లా ఇరవై ఏళ్ళు సంచరించి తిరిగి తన జన్మస్థలం చేరుకుని ఒక గుడిసె వేసుకున్నాడు. అతను ఎంత పేదవాడంటే అతను కట్టుకునే అంగవస్త్రం కూడా ఎన్నో అతుకుల్తో వుండేది. గంజి కాచుకుని తాగేవాడు. అతనికి ఒక చిప్ప లాంటి మట్టి పాత్ర వుండేది. అందులోనే తినడం, తాగడం చేసేవాడు.

అతనికి పిల్లల్తో ఆడుకోవడమంటే ఎంతో ఇష్టం. ఎక్కడికి వెళ్ళినా పిల్లల్తో దాగుడుమూతలు ఆడేవాడు. అతన్ని వదిలి పిల్లలు వెళ్ళిపోయాకా ఎక్కడ దాక్కున్నవాడు అక్కడే వుండిపోయి చీకటి పడేదాకా అక్కడే నిలబడిపోయేవాడు. చివరికి ఎవరయినా అతని దగ్గరకు వచ్చి ఏం చేస్తున్నావని అడిగితే 'పిల్లల్తో దాగుడు మూతలాడుతున్నానని ఎవరో వచ్చి దాక్కున్న నన్ను కనిపెడతారని'అనేవాడు. ఎవరు తనను ఆటపట్టించినా ఏమీ అనుకునేవాడు కాదు.

ఒక సందర్భంలో ఎవరో 'పిల్లల్తో ఆడుకోవాలంటే నీకు ఎందుకంత ఇష్టం?' అని అడిగారు. దానికి అతను 'పిల్లలలోని నిష్కళంక మయిన మనసు, నిష్కాపట్యం, స్వచ్ఛత నాకిష్టం. తప్పు చెయ్యడం, అబద్ధం చెప్పడం వాళ్ళకు తెలీదు' అన్నాడు.

అతను గొప్ప అక్షర శిల్పి. అద్భుతంగా అక్షరాలు రాయడంలో నేర్పు కలిగిన వాడు. ఎవరయినా అభ్యర్థించినా వారికి రాసి పెట్టేవాడు కాదు. కాని పిల్లలు ఎప్పుడు కోరినా కుంచె తీసుకుని వాళ్ళకు అందంగా రాసి పెట్టేవాడు.

అతను జనాల్తో ఎప్పుడూ

''నాకు అయిష్టమయినవి మూడు విషయాలు

కవుల కవిత్వం

రచయితల రచనలు

వంట వాళ్ళ వంట సరంజామా'' అనేవాడు. ★

**అతనికి పిల్లల్తో ఆడుకోవడమంటే ఎంతో ఇష్టం. ఎక్కడికి వెళ్ళినా పిల్లల్తో దాగుడుమూతలు ఆడేవాడు. అతన్ని వదిలి పిల్లలు వెళ్ళిపోయాకా ఎక్కడ దాక్కున్నవాడు అక్కడే వుండిపోయి చీకటి పడేదాకా అక్కడే నిలబడిపోయే వాడు. చివరికి ఎవరయినా అతని దగ్గరకు వచ్చి ఏం చేస్తున్నావని అడిగితే 'పిల్లల్తో దాగుడు మూతలాడుతున్నానని ఎవరో వచ్చి దాక్కున్న నన్ను కనిపెడతారని'అనేవాడు.**

---

**(9వ పేజీ తరువాయి)**

బయటికి వెళ్ళకుండా పదిహేను రోజుల దాకా ఇంట్లోనే వుండిపోయాడు కృష్ణమూర్తి. సునంద ఏడ్చిఏడ్చి పేషెంట్‌లా మారింది. పలకరించడానికి వస్తున్న వాళ్ళు ధైర్యం చెప్పి వెళ్తున్నారు. తప్పితే అందరిలోనూ ఏమీ చేయలేని అసహాయత!

ఏ సాయమూ చేయలేని అశక్తత!!

ఫోను మోగుతుంటే ఎత్తడానిక్కూడా ఇష్టపడలేదు కృష్ణమూర్తి...

తర్వాత సెల్‌ఫోన్ మోగింది. సెల్‌ఫోన్ స్క్రీన్ మీద వచ్చిన మెసెజ్‌లో 'డాడీ...'అన్న పదం చూసి ఉలిక్కిపడ్డాడు. ఆదుర్దాగా మెసెజ్‌ని చదివాడు.

''డాడీ... మీతో మాట్లాడాలి... మిమ్మల్ని, మమ్మీని చూడకుండా వుండలేకపోతున్నాను. పది నిమిషాల్లో ఫోన్ చేస్తాను... ఫోనెత్తండి ప్లీజ్...''అన్న వాక్యాలు కన్పించాయి.

కృష్ణమూర్తి ఆనందంతో నమ్మలేక సునందకి ఆ మెసెజ్‌ని చూపించాడు. పది నిమిషాలు... పది యుగాలుగా గడిచాయి.

ఫోన్ మోగింది...

కృష్ణమూర్తి గాబరాగా ఫోనెత్తి 'తల్లీ... నేనమ్మ... డాడీని'' అన్నాడు.

''సారీ కృష్ణమూర్తిగారు... మీ కూతురు చేసిన పనికి మేంకూడా బాధ...''చిరాగ్గా ఫోన్ పెట్టేసాడు.

అయిదు నిమిషాల తర్వాత... ఫోన్ మళ్ళీ మోగింది.

తటపటాయిస్తూనే ఫోన్ ఎత్తాడు.

''డా.... డీ...''అన్న పిలుపు.

''అమ్మా... ఎలా వున్నావురా...'' కృష్ణమూర్తి మాట్లాడాననుకున్నాడు. సునంద పరుగున వచ్చింది.

''డాడీ... హెన్రీ మంచివాడు కాదు... ఇద్దరం విడిపోదామనుకుంటున్నాం. వాడికి ఇంకో గర్ల్‌ఫ్రెండ్ వుంది''అంది.

ఆ మాట విన్న సునంద క్రెడిల్ లాక్కొని కోపంగా అంది.

''నువ్వు అమెరికన్‌వి... అమెరికన్స్‌కి గర్ల్‌ఫ్రెండ్స్ కామన్ కదా... ఆ మాత్రం దానికే ఎందుకు విడిపోవాలి?''

''అదేంటమ్మా...? నా భర్తకి మరో ఆడది వుంటే ఎలా భరించగలను? అందుకే వాడితో చెప్పాను. ఆ అమ్మాయిని వదిలెయ్యమని... వాడు విన్లేదు... అంతేకాదు నాముందే దాంతో బెడ్‌రూంలోకెళ్తే సహించలేకపోయాను. అందుకే విడిపోదామనుకుంటున్నాను...

''దట్స్ గుడ్... అమెరికన్ కల్చర్‌తో పెళ్ళిచేసుకున్నావ్. కాని నీ ఒంట్లో పారుతోంది ఇండియన్ బ్లడే... ఇండియన్‌ని అని ఇప్పటికైనా అర్థమైందా?'' అంది సునంద.

''సారీ మమ్మీ... మిమ్మల్ని బాధపెట్టాను. మీరు రమ్మంటే ఇంటికి వస్తాను''అంది బాధగా.

''రా తల్లీ... ఈ క్షణమే బయల్దేరిరా... నీకోసం ఎదిరిచూస్తుంటాం''అన్నాడు కృష్ణమూర్తి. క్రెడిల్ లాక్కొని పెట్టేస్తూ... అతడి కళ్ళల్లో నీళ్లు సుడులు తిరుగుతున్నాయి.

ఇద్దరి మొహాల్లోనూ చెప్పరాని అనుభూతి... ఆనందం... రోష్నిని కన్నప్పుడు చూసుకున్నప్పటి సంతోషం...

'ఇదంతా ఓ పీడకల అని మర్చిపోవాలి''అన్నాడు కృష్ణమూర్తి కళ్లు తుడుచుకుంటూ...

''కాని... దానికి మళ్ళీ పెళ్లి చేయాలంటే ఎవరైనా ముందుకొస్తారంటారా?'' అంది సునంద.

''ఎందుకు రారు? అమెరికన్ సిటిజన్ అమ్మాయి కాబట్టి ఇమ్మిగ్రేషన్ దొరుకుతుందని తప్పకుండా చేసుకుంటారు... కాకపోతే రోష్ని పెళ్ళి... ఇప్పుడు కాదు... నాలుగేళ్ళ తర్వాత!!'' అన్నాడు కృష్ణమూర్తి రిలీఫ్‌గా.

ఇద్దరూ తలుపులు బార్లా తెరిచి... కూతురికోసం ఎదిరి చూస్తూ కూచున్నారు

★